సాక్షి అనకాపల్లి

శనివారం । 7 । జూన్ । 2025



ముస్లిం కుటుంబంపై కక్ష 10లో

టీడీపీ నేత అండతో ముస్లిం కుటుంబాన్ని రోడ్డున పడేశారు. కుమారుడి పెళ్లి వేడుకలో ఉండగా పొక్లెయిన్‌తో ఇల్లు కూల్చివేశారు.

ఉష్ణోగ్రతలు

శుక్రవారం

	గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	37.3/26.5

రాగల ఐదు రోజులు జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం తెలిపారు.



ఘనంగా క్షీరాభిషేకం

విశాఖ: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

300 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



ఆటోలో తరలిస్తున్న కోటా బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

నక్కపల్లి: రేషన్ డిపోల ద్వారా తెల్లకార్డుదారులకు పౌరసరఫరాల శాఖ సరఫరా చేస్తున్న బియ్యం పక్కదారి పడుతున్నాయి. మండలంలోని జానకయ్యపేటలో తెల్లకార్డుదారుల నుంచి కారు చౌకగా కొనుగోలు చేసి రైసు మిల్లులకు ఆటోలో తరలిస్తున్న 300 కిలోల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. జానకయ్యపేటలో ఆటోలో బియ్యం తరలిస్తున్న విషయం తెలుసుకున్న అధికారులు దాడులు నిర్వహించారు. జానకయ్యపేట, సిహెచ్‌ఎల్ పురం, పెదతీనార్ల, చినతీనార్ల తదితర చుట్టుపక్కల గ్రామాల్లో కార్డుదారుల నుంచి ఈ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు ఆటో డ్రైవర్ తెలిపాడని ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. కిలో రూ.18ల చొప్పున కొని అధిక ధరకు రైసు మిల్లర్లకు విక్రయిస్తుంటామని డ్రైవర్ చెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి ఆటోలో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయిస్ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడ్డ బియ్యం విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.75 వేలు ఉంటుంది.

నేడు అప్పన్న నిత్యకల్యాణం రద్దు

- రాత్రి 7 గంటల వరకే దర్శనాలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణం శనివారం రద్దు చేసినట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు శుక్రవారం తెలిపారు. ఆలయంలో కొలువుదీరిన లక్ష్మీనారాయణస్వామి వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా ఈ మార్పు చేశామన్నారు. ఈ నేపథ్యంలో రాత్రి 7 గంటల తర్వాత భక్తులకు దర్శనాలు లభించవని పేర్కొన్నారు. ఈ నెల 10న నృసింహ జయంతిని పురస్కరించుకుని ఆరోజు సాయంత్రం ఆరాధన టిక్కెట్లు రద్దు చేసినట్లు వెల్లడించారు. ఆ రోజు సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయని, భక్తులు ఈ విషయం గమనించాలని చెప్పారు.

సాహస అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: యువతలో సాహసోపేత స్ఫూర్తిని ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇచ్చే ప్రతిష్టాత్మక టెన్జింగ్ నార్కే నేషనల్ అడ్వెంచర్ అవార్డు–2024కి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమాధికారి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. సాహస రంగంలో అద్భుతమైన పనితీరు కనబరిచి, అత్యుత్తమ నాయకత్వ లక్షణాలను ప్రదర్శించి, ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోపు https://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తు కాపీని, అవసరమైన ఇతర ధ్రువపత్రాలతోపాటు జిల్లా యువజన సంక్షేమాధికారి కార్యాలయంలో సమర్పించాలి.

ఆశయానికి తూట్లు... రైతులకు అగచాట్లు

- అటకెక్కిన 'అన్నదాతా.. సుఖీభవ'
- మొక్కుబడిగా ఆర్బీకేల పనితీరు
- ఎరువులు, విత్తనాలు అందని పరిస్థితి
- మూలకు చేరిన కియోస్క్ మిషన్లు
- పాత పద్ధతిలోనే గ్రామానికి విత్తనాలు సరఫరా చేసేలా ప్రతిపాదన



ఏడాది పాలన

అంతులేని వేదన

రైతన్నకు కూటమి సర్కారు వెన్నుపోటు పొడిచింది. 'అన్నదాతా.. సుఖీభవ' పేరిట పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చి, రెండేళ్లు మొండి చేయి చూపించింది. వ్యవసాయ సేవలను అత్యంత చేరువలో గ్రామంలోనే అందించే ఆర్బీకేలు ఇప్పుడు మొక్కుబడిగా సాగుతున్నాయి. సేవలు పూర్తిగా అందివ్వకపోగా వాటిని కుదించి, మూడు గ్రామాలకు ఒక కేంద్రాన్ని పెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఇదేగాని జరిగితే వ్యవసాయం, పశు సంవర్ధక, ఫిషరీస్ సేవలు రైతులకు మరింత దూరమయ్యే అవకాశం ఉంది.



కియోస్క్ మిషన్‌ను వినియోగించుకుంటున్న రైతులు (ఫైల్)

చోడవరం: వ్యవసాయ సేవలు, విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు వెళ్లి రోజుల తరబడి వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద పడిగాపులు పడిన నాటి చీకటి రోజులు రైతులకు గుర్తొస్తున్నాయి. వారికి ఆ కష్టాల నుంచి విముక్తి కలిగించి, గ్రామంలోనే వ్యవసాయ సేవలన్నీ అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే)లను తెచ్చింది. ఆ వ్యవస్థలో ఏకంగా సుమారు రూ.50 లక్షల వ్యయంతో ఆర్బీకేలకు సొంత భవనాలు నిర్మించడంతోపాటు కుర్చీలు, కంప్యూటర్, టేబుళ్లు, పుస్తకాల రేక్‌లు సమకూర్చారు. రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు, శాస్త్రవేత్తల సూచనలు అందుకొని, విజ్ఞానాన్ని పొందేందుకు స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా విత్తనాలు, ఎరువులు పొందేందుకు కియోస్క్ మిషన్లు కూడా నెలకొల్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఆర్బీకేల్లో సేవలు అరకొరగానే రైతులకు అందుతున్నాయి. ఏడాది నుంచి కరెంటు బిల్లులు చెల్లించలేదు. ఏ రోజు విద్యుత్ కనెక్షన్ తొలగిస్తారో తెలీని పరిస్థితి.. ఇంటర్‌నెట్ సామర్థ్యం తగ్గించడంతో ఆన్‌లైన్ సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు.

'భరోసా' దక్కలేదు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'రైతు భరోసా' పేరిట అందించిన పెట్టుబడి సాయం స్థానంలో కూటమి ప్రభుత్వం 'అన్నదాతా.. సుఖీభవ'ను ప్రవేశపెడతామని చెప్పింది. గతంలో రూ.13,500 ఇస్తే.. ఇప్పుడు రూ.20 వేలు అందిస్తామని డంబాలు పలికింది. కానీ గత ఏడాది, ఈ ఏడాది రెండేళ్లు ఆర్థిక సాయం అందించలేదు సరికదా ఇంతవరకు కనీసం విధివిధానాలను రూపొందించలేదు. దీంతో అన్నదాతలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో వ్యవసాయాన్ని పండగలా మార్చిందని వారు గుర్తుచేసుకుంటున్నారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకుని, అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ అమలు చేశారని, కౌలు రైతులతో సహా ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం నేరుగా రైతుల ఖాతాలకు జమ చేశారని పేర్కొన్నారు.

ఆర్బీకేల్లో ఎన్నో సేవలు

జిల్లాలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో 2 లక్షల 20 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. ఇవి కాక అపరాలు, చెరకు, ఇతర వాణిజ్య పంటలు కూడా వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 23 వేల 300 మెట్రిక్ టన్నుల వరి విత్తనాలు కావాలని ప్రతిపాదన పెట్టారు. 33 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు కూడా కావాలని ప్రతిపాదన పంపించారు. అయితే ప్రతిపాదనలు ఆర్బీకేల ద్వారా జరగలేదు. వ్యవసాయాధికారుల అంచనాల మేరకు ప్రతిపాదన పెట్టారు. గతేడాది వరకు రైతులకు ఏ రకం వరి విత్తనం అవసరం, ఏ సమయంలో ఏ ఎరువు అవసరమో నేరుగా రైతే పాసుపుస్తకం పట్టుకొని ఆర్బీకేలకు వెళ్లి అక్కడ కియోస్క్ మిషన్‌లో స్వయానా నమోదు చేసుకునేవారు. కానీ ఇప్పుడు ఆర్బీకేల్లో ఆ పరిస్థితి లేదు. ఈ ప్రభుత్వం కియోస్క్ మిషన్లను నిరుపయోగంగా పక్కన పెట్టేసింది. పాత పద్ధతిలో రైతులకు కావలసినవి ఆర్బీకేలో ఉన్న సిబ్బందికి చెబితే వారు నమోదు చేసుకొని మొత్తం ఇండెంట్‌ను ప్రతిపాదనకు పంపుతున్నారు. దీనివల్ల పూర్తిస్థాయిలో విత్తనాలు, ఎరువులు సరఫరా కాకపోతే రైతులందరికీ అవి అందే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఏ రకం విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తే వాటినే రైతులు తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక రైతుల విజ్ఞానం కోసం ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీల వినియోగం కూడా పూర్తిగా లేదు. ఏదో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పే వ్యవసాయ కార్యక్రమాలు వచ్చినప్పుడు మాత్రమే టీవీలు ఆన్ చేస్తున్నారు. మిగతా సమయాల్లో రైతులకు అవసరమైన వ్యవసాయ సూచనలు తెలుసుకునే పరిస్థితి లేదు. అదే గతంలో ఉదయం నుంచీ సాయంత్రం వరకు టీవీలు ఆన్ చేసి వివిధ చానల్స్, ప్రభుత్వం నుంచి వచ్చే వ్యవసాయ కార్యక్రమాలన్నీ నిరంతరం చూసేందుకు వీలుండేది. రైతులకు సమయం దొరికినప్పుడు ఆర్బీకేలకు వచ్చి ఆ వ్యవసాయ సూచనలు తెలుసుకొని విజ్ఞానంతో వ్యవసాయం చేసుకునేవారు. ఇప్పుడు వ్యవసాయ సిబ్బంది సూచనలు చెబితే తప్ప వ్యవసాయంలో నష్టాలను టీవీలో చూసి నివారించుకునే అవకాశం లేకుండా పోయింది.





ఆర్బీకేలో స్మార్ట్ టీవీ ద్వారా వ్యవసాయ సూచనలు తెలుసుకుంటున్న రైతులు (ఫైల్)

జిల్లాలో ఆర్బీకేలు	సిబ్బంది
మంజూరైనవి 450	వీఏఏలు 181
వినియోగంలో ఉన్నవి 438	వీహెచ్ఏలు 103

కియోస్క్ మిషన్ ఎక్కడ?



మాది లక్ష్మీపురం గ్రామం. నాకు రెండెకరాల పొలం వుంది. ఖరీఫ్ సీజన్‌లో వరి వేస్తాను. మాది ముంపు ప్రాంతం కావడంతో ఎక్కువగా వరిలో ఆర్‌జీఎల్ రకం విత్తనం వేస్తాము. గతేడాది వరకు మాకు నచ్చిన విత్తనం, ఎరువులు మిషన్‌లో నమోదు చేసుకునేవాడిని. ఎరువులు కూడా కియోస్క్ మిషన్‌లో నమోదు చేసుకునేవాడిని. నా పేరున నాకు ఏమి కావాలో అది నమోదయ్యేది. ఈసారి అలా చేయలేదు. విత్తనాలు వచ్చాక ఏవి ఉంటే అవి తీసుకోవాలట.

–బలిరెడ్డి కాసు, రైతు, లక్ష్మీపురం

సూచనలు అందడం లేదు



మా ఊరి రైతు భరోసా కేంద్రంలో ఇంతకు ముందులా రోజూ టీవీ వేసి ఉండకపోవడంతో వ్యవసాయ సూచనలు తెలుసుకోవడం ఇబ్బందిగా ఉంది. నేను వరి, చెరకు పండిస్తాను. ఇంతకు ముందు మాకు విత్తనాలు కావాలంటే మిషన్‌లో నమోదు చేసుకునేవాళ్లం. ఇప్పుడు అలా లేదట. మిషన్‌ను పక్కన పెట్టేశారు. వరి, చెరకు పంటల్లో తెగుళ్లు, ఇంకా ఏమైనా వ్యవసాయ సూచనలు కావాలంటే టీవీలో చూసి తెలుసుకునేవాడిని. ఇప్పుడు చెప్పేవారు లేరు.

– కరక తలుపులయ్య, రైతు, చాకిపల్లి, రామజోగిపాలెం

పరీక్ష తప్పింది విద్యార్థులు కాదు.. కూటమి ప్రభుత్వం

- టెన్త్ ఫలితాల్లో తీవ్రమైన అవకతవకలు
- మొదట ఫెయిలైన వారికి రీ కౌంటింగ్‌లో అధిక మార్కులు
- విద్యాశాఖ మంత్రి లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం డిమాండ్



విద్యా శాఖ ఏడీ రమాజ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు హేమంత్

అనకాపల్లి: రాష్ట్ర విద్యాశాఖ వైఫల్యంతో ఎంతో మంది టెన్త్ విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరమైందని, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యత వహించి తక్షణమే పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ రమాజ్యోతికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి మూల్యాంకనంలో లోపాలు విద్యార్థుల పాలిట శాపాలుగా మారాయన్నారు. తక్కువ మార్కులు వచ్చిన వారు, పరీక్ష తప్పిన వారు రీ వాల్యుయేషన్ చేయిస్తే.. అనేకమందికి ఫస్ట్ క్లాస్ మార్కులు వచ్చాయని, ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహించారని ఆయన ప్రశ్నించారు. కూటమి పాలనలో విద్యారంగం భ్రష్టుపట్టిపోయిందన్నారు. కచ్చితమైన ఫలితాలు వెల్లడించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం కావడంతో రాత్రీ పగలూ కష్టపడి చదివి పరీక్షలు రాసిన పదో తరగతి విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అంతులేని మానసిక క్షోభకు గురయ్యారన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలోనే కూటమి ప్రభుత్వం చేతగానితనం బయటపడిందన్నారు. ప్రశ్నాపత్రాలు వాట్సాప్ వేదికగా లీక్ అయినా తప్పులను సరిదిద్దుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మన రాష్ట్రంలో చదివే ప్రతి విద్యార్థి ప్రపంచస్థాయిలో పోటీని ఎదుర్కొనేలా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంస్కరణలు తీసుకొస్తే.. కూటమి ప్రభుత్వం వాటికి దశల వారీగా మంగళం పాడేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి విద్యార్థి విభాగం అధ్యక్షుడు చరణరాజ్, పెందుర్తి సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉగ్గిన నాగార్జున, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ బోడి వెంకటేష్ యాదవ్, విద్యార్థులు బోలెం హరి హేమంత్, సంతోష్, కిరణ్, ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 88.39 శాతం హాజరు

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో డీఎస్సీ–2025 ద్వారా విద్యాశాఖ నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. డీఎస్సీ అభ్యర్థులకు జిల్లాలో విద్యాశాఖ మొత్తం 12 పరీక్షా కేంద్రాలను కేటాయించింది. మొదటి రోజు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో 11 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. తొలి రోజు 2,447 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు పంపించగా, వారిలో 88.39 శాతం (2,163 మంది) హాజరయ్యారు. 284 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) ఎన్. ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఉదయం సెషన్‌లో 7 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు 1,435 మందికి 1,278 మంది (89.06శాతం) హాజరయ్యారు.మధ్యాహ్నం 4 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు 1,012 మందికి 885 మంది (87.45శాతం) హాజరయ్యారు. డీఈవో ఒక కేంద్రాన్ని, పరీక్షల స్క్వాడ్ మూడు కేంద్రాలను పర్యవేక్షించారు. పరీక్షలు జరిగిన కేంద్రాలలో బుచ్చిరాజుపాలెంలోని ఏడీజెడ్ ఆరోవనా డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రంలో అత్యధికంగా 450 మంది అభ్యర్థులను కేటాయించగా, నగరంలోని చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో అత్యల్పంగా 85 మంది అభ్యర్థులను కేటాయించారు.



మధురవాడ గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

చేతకాక.. కమిషనర్ లేక!



కమిషనర్‌ను తక్షణమే నియమించాలంటూ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు నేతృత్వంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. కూటమి ప్రభుత్వ అసమర్థతపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మండిపడగా.. కూటమి కార్పొరేటర్ల అసంబద్ధ వాదనలతో సభ రసాభాసగా మారింది. అడ్డగోలుగా మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో చూపిన చొరవ, జీవీఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించడంలో చూపకపోవడంపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. ప్లకార్డులతో మేయర్ పోడియంను చుట్టుముట్టి, తక్షణమే జీవీఎంసీకి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. దాదాపు 15 నిమిషాలు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల నినాదాలతో కౌన్సిల్ సమావేశ మందిరం మార్మోగింది.

- రెగ్యులర్ కమిషనర్ ఎక్కడ అంటూ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆగ్రహం
- జీవీఎంసీపై కూటమి నిర్లక్ష్యం
- 27 అజెండా అంశాలు.. 6 టేబుల్ అజెండా అంశాలు
- సుదీర్ఘంగా సాగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాస్

డాబాగార్డెన్స్ (విశాఖ): నూతన మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాద, ప్రతిపాదనలతో హోరెత్తింది. ప్రధాన అజెండాలోని 27 అంశాలతో పాటు, టేబుల్ అజెండాలోని 6 అంశాలు సభ్యుల చర్చకు వచ్చాయి. వీటిలో 3 ప్రధాన అజెండా(1, 10, 14) అంశాలు, 2 టేబుల్(1, 6) అజెండా అంశాలు తప్ప, మిగిలినవన్నీ ఆమోదం పొందాయి.

రెగ్యులర్ కమిషనర్ నియామకం ఎప్పుడు?

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగానే వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు సభను అడ్డుకున్నారు. ప్లకార్డులతో మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి, జీవీఎంసీకి తక్షణమే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కీలకమైన కమిషనర్ పోస్టును నెలల తరబడి భర్తీ చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని నినాదాలు చేశారు. దాదాపు 15 నిమిషాల పాటు వారి నినాదాలతో సభ దద్దరిల్లింది. మేయర్ పీలా శ్రీనివాసరావు వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. మొదట పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాప తీర్మానం చేయాలని సూచించడంతో, వైఎస్సార్‌సీపీ సభ్యులు తమ సీట్లలో కూర్చున్నారు. అనంతరం, ఉగ్రదాడి బాధితులకు రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు.

ఇన్‌చార్జ్ కమిషనర్ రాకపోవడంతో బ్రేక్

ఇన్‌చార్జ్ కమిషనర్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నందున సమావేశానికి హాజరుకాలేదు. దీనిపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, కమిషనర్ లేకుండా సభను నిర్వహించడాన్ని తప్పుబట్టారు. వారి నిరసనతో మేయర్ పీలా శ్రీనివాసరావు 15 నిమిషాల్లోనే టీ బ్రేక్ ప్రకటించారు. దాదాపు అరగంట తర్వాత కమిషనర్ హాజరు కావడంతో సభ తిరిగి ప్రారంభమైంది.

జీరో అవర్ కోసం పట్టు

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మేయర్ పీలా అజెండాలోని అంశాలపై చర్చ ప్రారంభించగా, కార్పొరేటర్లు తమ వార్డు సమస్యల పరిష్కారం కోసం జీరో అవర్ కావాలని పట్టుబట్టారు. మేయర్ దీనికి అంగీకరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ జీవీఎంసీకి నాలుగు నెలలుగా కమిషనర్ లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. కార్పొరేటర్లు, స్థానిక ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రెండు, మూడు రోజుల్లో కమిషనర్‌ను నియమించేలా చూడాలని సూచించారు.

ఎవడ్రా నువ్వు..!

జీరో అవర్‌లో వాగ్వాదం చోటుచేసుకుంది. కార్పొరేటర్ కంపా హనోక్ మాట్లాడుతుండగా.. వైఎస్సార్‌సీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు మాట్లాడేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన హనోక్, 'ఎవడ్రా నువ్వు'అంటూ నోరు పారేసుకున్నారు. ఈ ఘటనతో సభలో కొంత గందరగోళం నెలకొంది. వెంటనే రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కల్పించుకుని, వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచి, పార్టీ మారిన విషయాన్ని గుర్తుంచుకోవాలని హనోక్‌కు చురకంటించారు. హనోక్ వెంటనే క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

జీవీఎంసీలో ఘోస్ట్ ఉద్యోగులు

జీవీఎంసీలో 'ఘోస్ట్ ఉద్యోగులు'ఉన్నారని, పని చేయకుండానే జీతాలు తీసుకుంటున్నారని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. అలాంటి వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ వ్యర్థాలు పంట పొలాల్లోకి చేరి రైతులను ఇబ్బంది పెడుతున్నందున, డ్రైన్‌లు నిర్మించాలని పల్లా సూచించారు.

ఎఫ్‌ఆర్‌యూ ఒప్పందం ఎప్పుడైనా రద్దు చేయొచ్చు

శ్రీహరిపురంలోని ఫస్ట్ రిఫరల్ యూనిట్ నిర్వహణ కోసం రూ.1.20 కోట్లు కేటాయించడం, విజయ (బెహరా) వెల్ఫేర్ సొసైటీకి చెల్లింపుల ఆమోదంపై జీవీఎంసీ కౌన్సిల్‌లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ పీవీ సురేష్ సహా ఇతర కార్పొరేటర్లు మాట్లాడుతూ సొసైటీ ఉచిత సేవలకు బదులు డబ్బులు వసూలు చేస్తోందని, 30 ఏళ్ల లీజుపై కూడా అభ్యంతరం తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్, సొసైటీ సరిగా పనిచేయకపోతే విచారణ జరిపి ఒప్పందాన్ని ఎప్పుడైనా రద్దు చేస్తామని మేయర్ పీలా శ్రీనివాసరావు ద్వారా హామీ ఇచ్చారు.

ఆమోదించిన అంశాల్లో ప్రధానమైనవి

- జీవీఎంసీలోని ఈఈ–1 పరిధిలో సివిల్ పనుల పర్యవేక్షణకు అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లను ఏడాది పాటు కొనసాగింపు.
- రూ.55.40 లక్షల అంచనా వ్యయంతో 19వ వార్డు పెదవాల్తేరులో చేపల మార్కెట్ పునరుద్ధరణ .



- ఇంజినీరింగ్ విభాగం ఈఈ–5 పరిధిలో 18 మంది టెక్నికల్, నాన్ టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సెక్యూరిటీ గార్డుల కొనసాగింపు.

పీలా గోవిందు హాజరుపై అభ్యంతరం

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందు హాజరుపై డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అభ్యంతరం తెలిపారు. ఏ హోదాలో ఆయన వచ్చారని ప్రశ్నించగా, పీలా గోవింద్ ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అని, ప్రభుత్వ ప్రత్యేక ఉత్తర్వుల మేరకు ప్రత్యేక ఆహ్వానితుడిగా వచ్చినట్లు అధికారులు వివరించారు.

క్లుప్తంగా

అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు దరఖాస్తులు

మాకవరపాలెం: అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ శుక్రవారం తెలిపారు. రెండు నెలలపాటు మాకవరపాలెం మండల కేంద్రంలో ఉన్న నాక్ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 44 ఏళ్లలోపు ఉండి, ఇంటర్ ఆపైన చదువుకున్న వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 9490219717 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


చికిత్స పొందుతూ మృతి చెందిన కుండల లోకనాథం

యలమంచిలి రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యలమంచిలి టిడ్కో గృహ సముదాయం నివాసి కుండల లోకనాథం (57) శుక్రవారం మృతి చెందారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో లోకనాథం స్థానిక టిడ్కో గృహ సముదాయానికి సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ పెట్రోల్ బంక్‌లో తన స్కూటీలో పెట్రోల్ పోయించుకుని తిరిగి వస్తుండగా ఎదురుగా తుని వైపు వెళ్తున్న తుని ఎంఆర్ పేటకు చెందిన వాన అప్పలనాయుడు(25) బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లోకనాథాన్ని ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం లోకనాథం మృతి చెందినట్టు యలమంచిలి ట్రాఫిక్ బి.రామకృష్ణ తెలిపారు. మృతుని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ముస్లిం కుటుంబంపై కక్షసాధింపు


పొక్లెయిన్‌తో కూల్చివేయడంతో నేలమట్టమైన ఇల్లు

- వివాహ వేడుకలో ఉండగా ఇల్లు కూల్చివేత
- టీడీపీ నేత అండతో జీడిపిక్కల వ్యాపారి దారుణం

నాతవరం: ముస్లిం కుటుంబంపై కూటమి నేతలు కక్ష సాధింపు చర్యలకు దిగారు. కుమారుడి పెళ్లి వేడుకలో ఉండగా పొక్లెయిన్‌తో వారి ఇల్లు కూల్చివేశారు. దీనికి సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలు.. జిల్లేడుపూడి పంచాయతీ శివారు వై.వెంకయ్యపాలెం గ్రామానికి ఇరవై ఏళ్ల క్రితం షేక్ సుభాన్ కుటుంబం వలస వచ్చింది. దివంగత పారిశ్రామికవేత్త, నూకాంబిక అలయ నిర్మాణకర్త ఎం.ప్రభాకర్ చౌదరి సుభాన్‌కు ఆశ్రయం కల్పించారు. సుభాన్ ఓ రైతు నుంచి స్థలం కొని తాటాకు ఇల్లు కట్టుకొని చికెన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రభాకర్ చౌదరి దివంగతులయ్యాక సుభాన్‌కు సమస్య మొదలైంది. సుభాన్ ఇంటికి సమీపంలో ఉన్న జీడిపిక్కల పరిశ్రమను కేరళకు చెందిన వ్యక్తి నడిపేవారు. ఆయన వేరొకరికి పరిశ్రమను విక్రయించారు. జీడి పిక్కల ఫ్యాక్టరీకి ఈశాన్య భాగంలో సుభాన్ ఇల్లు ఉందని, దాంతో వ్యాపారం సరిగా జరగలేదంటూ ఇల్లు ఖాళీ చేయమని కొత్త యాజమాన్యం తీవ్ర ఒత్తిడి తెస్తోంది. ఈ వివాదం రెండేళ్ల నుంచీ నలుగుతోంది. జీడి పిక్కల ఫ్యాక్టరీ యజమాని టీడీపీకి చెందిన స్థానిక సర్పంచ్‌కు సన్నిహితుడు కావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి సుభాన్‌కు సమస్య మొదలైంది. ఏప్రిల్ నెలలో పంచాయతీ డ్రైనేజీ పనుల పేరుతో పొక్లెయిన్‌తో వీరి ఇంటి ముందు భాగంలో కాలువ పనులు చేశారు. టీడీపీ నేతలు, అధికారుల అండతో తన ఇంటికి ముప్పు పొంచి ఉందని గ్రహించిన సుభాన్ కోర్టును ఆశ్రయించారు. కోర్టులో కేసు నడుస్తుండగానే రెండు రోజుల క్రితం ఆయన ఇంటిని నేలమట్టం చేశారు.

కుమారుడి వివాహం రోజునే ఇల్లు కూల్చివేత

తన చిన్న కుమారుడి వివాహం నిమిత్తం ఈనెల 4వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి రాజమండ్రి సమీపంలో జగ్గంపేట వెళ్లామని సుభాన్ చెప్పారు. ఆదే రోజు రాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పొక్లెయిన్‌తో తమ ఇంటిని కూల్చేశారని, శబ్దం రావడంతో ఇంటి పక్కనే నివాసం ఉంటున్న చిటికెల కృష్ణవేణి గమనించి 'ఏమిటీ అన్యాయం' అని ప్రశ్నించగా.. ముఖానికి ముసుగులు వేసుకున్న వ్యక్తులు నీకు సంబంధమేమిటని బెదిరించి వెళ్లిపోయారని వివరించారు. సమాచారం అందుకొని వెంటనే 100 నంబరుకు ఫిర్యాదు చేశామన్నారు. నాతవరం పోలీసులు వెంటనే తమ నుంచి వివరాలు తీసుకున్నారని, కానీ నేటి వరకు రాలేదన్నారు. దుండగులు తాము బక్రీద్ పండగ కోసమని పెంచుతున్న మేకపోతును కూడా తీసుకుపోయారన్నారు. ఈనెల 5న ఇంటికి చేరుకొని, ఫ్రిజ్ తదితర విలువైన సామగ్రితో సహా తమ ఇల్లు ధ్వంసమైన దృశ్యం చూసి కన్నీళ్లు పెట్టుకున్నామన్నారు. 6వ తేదీన బంధుమిత్రులకు పెళ్లి భోజనాలకు పిలిచామని, కానీ తామే రోడ్డున పడ్డామని వారు ఆవేదనగా చెప్పారు.

బ్రాండిక్స్ ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి


బాధితులను పరామర్శిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము

అచ్యుతాపురం రూరల్: బ్రాండిక్స్ బస్సు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. శుక్రవారం యలమంచిలి మండలం కృష్ణాపురంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అచ్యుతాపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందుకుంటున్న మహిళా కార్మికులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రంగా గాయాలైన మహిళా కార్మికులను అనకాపల్లి ఆసుపత్రికి తరలించారన్నారు. మహిళా కార్మికులు గత సంవత్సర కాలం నుంచి బస్సుల ఫిట్‌నెస్ సరిగ్గా లేదని చెబుతున్నప్పటికీ మూర్ఖంగా వ్యవహరించడంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. స్టీరింగ్ లోపం కారణంగా బస్సు అదుపు తప్పి బోల్తాపడడంతో సుమారు 30 మంది మహిళా కార్మికులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలన్నారు.

పీతపాలెంలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభం


పార్కు శిలా ఫలకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే రామకృష్ణ

అనకాపల్లి: కోడూరు పంచాయతీ పరిధి పీతపాలెం గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్కును శుక్రవారం కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనకాపల్లి కేంద్రంలో తొలి ఎంఎస్ఎంఈ పార్కును కోడూరులో ఏర్పాటు చేశామని, పారిశ్రామిక పార్కులో స్థలాలు పొందిన వారు వెంటనే యూనిట్ల స్థాపన మొదలు పెట్టాలని కోరారు. పార్కులో యూనిట్ల స్థాపనకు 171 మందికి అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ.. పార్కును రూ. 59.47 కోట్లతో అభివృద్ధి చేశామని, 250 ప్లాట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. కోడూరు గ్రామం నుంచి పీతపాలెం వరకు రెండు కిలోమీటర్ల రహదారిని రూ.79.42 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించామన్నారు. ఆర్డీవో షేక్ ఆయిషా, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు ఎస్.నరసింహారావు, డిప్యూటీ జోనల్ మేనేజరు సూర్యనారాయణ, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జి.నాగరాజారావు, తహసీల్దారు బి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నాతవరం/మాడుగుల: నాతవరం, మాడుగులలోని కేజీబీవీల్లో పలు పోస్టుల భర్తీకి ఈ నెల 10న నోటిఫికేషన్ విడుదల కానుంది. అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటరు సమగ్ర శిక్షా జిల్లా అధికారి ఉత్తర్వుల ఆనుసరించి కేజీబీవీలో దరఖాస్తులు స్వీకరించనున్నారు. టైప్–4 కేజీబీవీలో హెడ్ కుక్, అసిస్టెంట్ హెడ్ కుక్, చౌకీదార్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయా మండల విద్యాశాఖాధికారులు సూచించారు. హెడ్ కుక్ అసిస్టెంటు హెడ్ కుక్ విద్యార్హత తప్పనిసరి కాదని, చౌకీదార్ పోస్టుకు 7వ తరగతి చదివి ఉండాలన్నారు. వచ్చేనెల ఒకటో తేదీకి 45 సంవత్సరాలు మించరాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 47 ఏళ్లు నిండరాదన్నారు. విభిన్న ప్రతిభావంతులకు గరిష్ఠ వయస్సు 52 సంవత్సరాలన్నారు. ఎంపికైన వారికి గౌరవ వేతనం రోజు ఒక్కంటికి రూ.250 చొప్పున నెలకు రూ.7,500 ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పోస్టులు మండల యూనిట్‌గా పరిగణిస్తామన్నారు. పూర్తి వివరాలను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి


మృతుడు అప్పికొండ అప్పారావు

అచ్యుతాపురం రూరల్: మండలంలో గొర్లి ధర్మవరం గ్రామానికి చెందిన అప్పికొండ అప్పారావు(60) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. ఐవోసీఎల్ కంపెనీలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అప్పారావు అక్కడికక్కడే మృతి చెందారు. వాహనంపై ఉన్న మరో వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని జరిగిన ఘటనపై వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు పైనుంచి పడిన యువకుడు మృతి


నడిపల్లి తరుణ్(ఫైల్)

బుచ్చెయ్యపేట: మండలంలోని రాజాం గ్రామానికి చెందిన నడిపల్లి తరుణ్(19) ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. గత నెల 15వ తేదీన గ్రామంలో తాడిచెట్టు ఎక్కి తాటికాయలు నరికి చెట్టు దిగుతుండగా తరుణ్ కాలు జారి పడిపోయాడు. అపస్మారక స్థితికి చేరిన అయన్ను అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గత 20 రోజులుగా వైద్య సేవలు పొందుతూ తరుణ్ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన తల్లి పద్మ.. తరుణ్ చిన్నతనంలోనే మృతి చెందగా.. తండ్రి అప్పలనాయుడు బాగోగులు చూసుకుంటున్నాడు. ఐటీఐ చదువుతున్న తరుణ్ అకాల మృతితో తండ్రి అప్పలనాయుడు భోరున విలపిస్తున్నాడు.

ఏయూలో సమూల మార్పులు

విభాగాలకు నూతన డీన్, డైరెక్టర్ల నియామకం


మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం(విశాఖ): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్, శుక్రవారం పరిపాలనకు సంబంధించి పలువురు డీన్‌లు, డైరెక్టర్‌లను పూర్తిస్థాయిలో మార్పు చేశారు. పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం, సేవలను వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ సంస్థాగత మార్పులు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

కీలక నియామకాలు

డీన్ అండ్ ఫ్యాకల్టీ అఫైర్స్, డీన్ అవుట్‌రీచ్, డీన్ అలమ్నీ రిలేషన్స్, డీన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్, ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్, చీఫ్ కో–ఆర్డినేటర్‌లు వంటి నూతన పదవులను ఏర్పాటు చేశారు. స్పాట్ వాల్యుయేషన్ విభాగానికి చీఫ్ కో–ఆర్డినేటర్‌ను నియమించారు. బోధనా సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా డీన్ ఫ్యాకల్టీ అఫైర్స్‌ను నియమించారు. డీన్ అలమ్నీ రిలేషన్స్ పదవిని ఏర్పాటు చేశారు. డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ – సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఓపెన్ లెర్నింగ్‌లను అనుసంధానించి, ఒకే డైరెక్టర్ పరిధిలోకి తీసుకువచ్చారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, కళల విభాగాలను అనుసంధానిం చనున్నారు.

నూతన డీన్‌ల వివరాలు

డీన్ ఫ్యాకల్టీ అఫైర్స్: కె. రాంబాబు, డీన్ అకడమిక్స్ అఫైర్ కె. శ్రీనివాసరావు, డీన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ వల్లికుమారి (కంప్యూటర్ సైన్స్), డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ – సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఓపెన్ లెర్నింగ్ ప్రొఫెసర్ అప్పలనాయుడు (కెమికల్ ఇంజనీరింగ్), డీన్, పీజీ అండ్ ప్రొఫెషనల్ ఎగ్జామినేషన్స్ ఆచార్య మునిస్వామి (స్టాటిస్టిక్స్), డీన్ అలమ్నీ రిలేషన్స్ ప్రొఫెసర్ శ్యామల (కెమిస్ట్రీ), డీన్ అవుట్‌రీచ్ ప్రొఫెసర్ కె. రమాసుధ (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ ఎస్. హరినాథ్ (సోషల్ వర్క్), డీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్లానింగ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ కె.ఎస్. రావు (సివిల్ ఇంజనీరింగ్), చీఫ్ కో–ఆర్డినేటర్ స్పాట్ వాల్యుయేషన్ కేటీ బలరాం పడాల్‌ను నియమించారు.

నేటి బీఎస్సీ ప్రాక్టికల్ పరీక్ష వాయిదా

మద్దిలపాలెం(విశాఖ): ఆంధ్ర యూనివర్సిటీ దూర విద్యలో బీఎస్సీ ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అయితే శనివారం జరగాల్సిన పరీక్షను బక్రీద్ పండగ కారణంగా వాయిదా వేశారు. ఈ నెల 11న ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎన్. విజయ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ మార్పును గమనించాలని ఆయన సూచించారు.

పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర పోస్టర్ విడుదల


పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అసయ్య

అనకాపల్లి టౌన్: దివ్యాంగులకు పారా స్పోర్ట్స్‌తో మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.అసయ్య తెలిపారు. స్థానికంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ క్రీడాకారులతో సమానంగా పారా క్రీడాకారులకు గౌరవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గనిరెడ్డి రాము, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సందేశంతో ఆకట్టుకున్న నాటికలు


దోషేచ వహ్ని నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం(విశాఖ): విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నెలవారీ నాటక ప్రదర్శనలో భాగంగా శుక్రవారం రెండు సందేశాత్మక నాటికలను ప్రదర్శించారు. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్. రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, నాంచారయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి ప్రదర్శనగా స్నిగ్ధ కలం నుంచి జాలువారిన 'దోషేచ వహ్ని'నాటిక ప్రదర్శించారు. మధ్యతరగతి కుటుంబాల్లో కుమార్తెను అత్తవారింటికి పంపిన తర్వాత, ఆ తల్లిదండ్రులు సర్వం కుమార్తెకు ధారపోస్తూ, కోడలి వేదనను పట్టించుకోని ఇతివృత్తంతో ఈ నాటిక సాగుతుంది. 'కార్యేషు దాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాత, శయినేషు రంభ, రూపేచ లక్ష్మి, క్షమయా ధరిత్రి' అనే ఆరు సూత్రాలను పాటిస్తూ జీవించే స్త్రీ పాత్రను ఈ నాటిక స్పృశించింది. అయితే భర్త తప్పు చేసినప్పుడు.. సప్తమ సూత్రంగా 'దోషేచ వహ్ని' అని స్త్రీ చైతన్యవంతురాలై తనకు తానుగా లిఖించుకోవాలి అన్న సందేశం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కథాంశానికి తగ్గట్టుగా నటీనటుల చక్కని నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి. రెండవ నాటికగా కెరటాలు ప్రదర్శించారు. భాగవతుల రమాదేవి రచించిన 'కెరటాలు'కథకు మునిపల్లె విద్యాధర్ నాటకీకరణ చేశారు. ఆధునిక భావాలతో నేటి యువత, ముఖ్యంగా మహిళలు తమ తల్లిదండ్రులను, ఆ తర్వాత భర్తను కూడా ఎదిరించడమే అభ్యుదయంగా భావించి తమ జీవితాలను, భవిష్యత్‌ను భగ్నం చేసుకుంటున్నారు. అలాంటివారు కెరటాల్లో కొట్టుకు పోకుండా.. గతంలో కొందరి జీవితాలను ఉదాహరణగా తీసుకుని ఒడ్డుకు చేరాలనే సందేశమిస్తూ ఈ నాటిక సాగింది. ఈ రెండు నాటికలను రాజాం కళాక్రియేషన్స్ సంస్థ ప్రదర్శించింది.

ఏపీ పీజీ ఈసెట్ ప్రారంభం


ఏపీ పీజీ ఈసెట్ పరీక్షలను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్

మద్దిలపాలెం(విశాఖ): రాష్ట్రవ్యాప్తంగా ఎంటెక్, ఎం.ఫార్మా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏపీ పీజీ ఈసెట్ 2025 శుక్రవారం ప్రారంభమైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ ఈ పరీక్షలను ప్రారంభించారు. పరీక్షల తొలిరోజు ఉదయం సెషన్‌లో 92 శాతం, మధ్యాహ్నం సెషన్‌లో 82 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏయూ నిర్వహిస్తున్న ఈ ప్రవేశ పరీక్ష సెట్ కోడ్‌ను వీసీ విడుదల చేయగా, రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, సెట్ కన్వీనర్ ఆచార్య పి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఈ పరీక్షలు శని, ఆదివారాల్లో కూడా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.


గడువులోగా చేరకపోతే సీట్లు రద్దు

గురుకులాల్లో 94 సీట్లు ఖాళీ

ఆరిలోవ(విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి కేటాయించిన సీట్లలో విద్యార్థులు వెంటనే చేరాలని గురుకులాల సమన్వయాధికారి సి. ప్రభావతమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని 11 గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ ఏడాది ఏప్రిల్ 13న రాత పరీక్ష నిర్వహించారు. అందులో అర్హత సాధించిన 565 మంది విద్యార్థులకు గానూ ఇప్పటివరకు 471 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. మిగిలిన 94 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఆయా విద్యార్థులు వెంటనే వారికి కేటాయించిన గురుకులాల్లో చేరాలని ఆమె సూచించారు. లేనిపక్షంలో వారి సీట్లు రద్దు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

ట్రెజరీలో అడ్డగోలు బదిలీలు

- కౌన్సెలింగ్ నిర్వహించకుండా 34 మందికి స్థానచలనం
- ఐదేళ్ల నిబంధనను పట్టించుకోని అధికారులు



విశాఖ సిటీ: జిల్లా ఖజానా శాఖలో చేపట్టిన ఉద్యోగుల బదిలీలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. నిబంధనలను ఉల్లంఘించి, ఇష్టానుసారంగా బదిలీల ప్రక్రియను ముగించారంటూ ఉద్యోగులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కలెక్టరేట్‌లోని ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్, సీనియర్ అకౌంటెంట్లు, సబార్డినేట్లకు సంబంధించిన బదిలీలలో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు?

సాధారణంగా ఒకే చోట ఐదేళ్లకు పైగా విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు తప్పనిసరిగా స్థానచలనం కల్పించాలి. అంతేకాకుండా, బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా పారదర్శకంగా చేపట్టాలి. అయితే జిల్లా ఖజానా శాఖలో ఈ నిబంధనలను పట్టించుకోకుండా, స్టేట్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ కనుసన్నల్లో 34 మంది ఉద్యోగులను ఇష్టానుసారంగా బదిలీ చేశారని సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఐదేళ్లు పూర్తయినా అక్కడే కొనసాగింపు

ఈ బదిలీల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు 12 మందితో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ, ఆ కమిటీ నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించలేదని సమాచారం. దీనికి తోడు, ఖజానా శాఖలో ఐదేళ్లుగా జూనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఒక ఉద్యోగికి బదిలీ చేయకపోవడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వాస్తవానికి సదరు జూనియర్ అకౌంటెంట్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ పలువురు సీఎం పేషీకి ఫిర్యాదు చేశారు. దానిపై విచారణ కూడా జరుగుతోంది. అయినప్పటికీ, ఆరోపణలను, ఐదేళ్ల నిబంధనను పట్టించుకోకుండా అతడిని బదిలీ చేయకపోవడం పట్ల ఆ శాఖ సిబ్బంది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

డీటీవో సంతకం చేసి సెలవుపై..?

ఈ బదిలీల ఫైల్‌పై జిల్లా ట్రెజరీ ఆఫీసర్ (డీటీవో) నాగభూషణం సంతకం చేసి దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళినట్లు సిబ్బందిలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ బదిలీల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని బాధితులు, ఇతర ఉద్యోగులు భావిస్తున్నారు. ఈ వ్యవహారంపై మరింత లోతైన విచారణ జరిపి, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

9న స్టీల్‌ప్లాంట్ సంఘీభావ ర్యాలీ

- కార్మికులు నిరసనల్లో పాల్గొనాలి
- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ వేదిక రాష్ట్ర కమిటీ

అల్లిపురం(విశాఖ): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అన్యాయంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ వేదిక రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు 9న రాష్ట్రవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ నిరసనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన 3,500 మందికి పైగా కార్మికులను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ నష్టాలకు కార్మికులను బాధ్యులను చేయడం అన్యాయమన్నారు. దేశంలోని ఇతర స్టీల్ పరిశ్రమలకు సొంత గనులు ఉండగా, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం గనులు కేటాయించకపోవడం విడ్డూరమన్నారు. అనకాపల్లిలో ఇంకా ఏర్పాటు చేయని మిట్టల్ స్టీల్ పరిశ్రమకు గనులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అడగడం ద్వారా విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 20 నుంచి జరిగిన సమ్మెను ప్రభుత్వం, యాజమాన్యం పోలీసు నిర్బంధంతో అణచివేసిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 9న కార్మికులు తమ పని ప్రదేశాల్లో, అన్ని పరిశ్రమల వద్ద జరిగే నిరసనల్లో పాల్గొనాలని కోరారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఉదయం 10 గంటలకు స్టీల్ ప్లాంట్ సంఘీభావ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

క్లుప్తంగా

భూ సమస్యపై అర్జీ



సమన్వయ కమిటీ సమావేశంలో అర్జీ స్వీకరిస్తున్న అధికారులు

కశింకోట: మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఓ వ్యక్తి అర్జీని అందజేశారు. మండల ప్రత్యేక అధికారి సుభాషిణి, ఎంపీడీవో వి.వి. రవికుమార్, హెచ్‌డీటీ కుమారస్వామి, ఏఎస్ఐ రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎస్. రామ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి ఆభరణాల బహూకరణ



వెండి వస్తువులను అర్చకులకు అందజేస్తున్న న్యాయవాది విశ్వేశ్వరరావు

అనకాపల్లి టౌన్: స్థానిక వేల్పులవీధిలో గల అన్నపూర్ణ సమేత శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానానికి న్యాయవాది మోటూరి విశ్వేశ్వరరావు, పద్మలతా దంపతులు వెండి ఆభరణాలు బహూకరించారు. ఆలయ వంశపారపర్య ధర్మకర్త తాటికొండ, కార్యనిర్వహణాధికారి సమక్షంలో అమ్మవారికి వెండి కన్నులు, బొట్టు, గరిట తదితరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు విస్సు, మచ్చలింగం, బాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

అనకాపల్లి టౌన్: ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం 1-2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని ఎన్ఎంయూఏ జోనల్ జాయింట్ కార్యదర్శి జి. శంకర్రావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 98వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా సస్పెండ్ చేసి, డిపో మార్చిన డ్రైవర్, కండెక్టర్లను ఇక్కడి డిపోలోనే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్. రావు, ఎస్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా ప్రకాష్

కశింకోట: మండలంలోని సోమవరం గ్రామం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా గూడూపు ప్రకాష్ మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు దశాబ్దాలుగా ఆయనే అధ్యక్షుడిగా కొనసాగుతూ వస్తున్నారు. ప్రకాష్‌ను మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 163 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,750	4,760
రెండవ రకం	3,600	4,180
మూడవ రకం	3,250	3,700

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: గ్యాంబ్లర్స్
సత్యనారాయణ స్క్రీన్-2	: 007
పర్తిసాయి	: ఖలేజా
షిర్డీసాయి	: థగ్ లైఫ్
వెంకటేశ్వర	: రాజావారు
శ్రీ సత్య	: శుభం
రామచంద్ర	: పాడేరు 12వ మైలు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 24 యూనిట్లు, బి పాజిటివ్ -12 యూనిట్లు, ఒ పాజిటివ్ -36 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ య.లోకేష్(ఫోన్ నంబర్ 9703619706)ను ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 334 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకునే వారిలో 311 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్ 08924-223595) ని సంప్రదించవచ్చు.

నిర్మాణ కార్మికుల జీవితాలకు ఏదీ భరోసా?



వేల్పులవీధి సర్వకాంబదాంబ పార్కు వద్ద భవన నిర్మాణ కార్మికులు

- కూటమి నాయకుల హామీ బుట్టదాఖలు
- అవస్థలు పడుతున్న కూలీలు

అనకాపల్లి: రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు వారివి.. కాయకష్టాన్ని నమ్ముకుని జీవించే కూలీలు వారు... ఎప్పుడు పనులు ఉంటాయో తెలియక నిత్యం జీవిత పోరాటం సాగిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నాయకులు భవన నిర్మాణ కార్మికులపై హామీల వర్షం కురిపించారు. సంక్షేమ బోర్డు ద్వారా మేలు చేస్తామని వరాలిచ్చారు. అధికారం చేపట్టి ఏడాదైనా ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భవన నిర్మాణ కార్మికుల భద్రత, సంక్షేమం కోసం 1996లో ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసింది. మొదటిలో ఈ పథకం భవన నిర్మాణ కార్మికులకు మాత్రమే అమలు చేసేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా భవన నిర్మాణకార్మికుల సంక్షేమ బోర్డులో అనేక మంది కులవృత్తుల వారిని ప్రభుత్వాలు చేర్చాయి. సంక్షేమ బోర్డులో ఉపాధిహామీ పథకం కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఎల్రక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, చిన్నపాటి దుకాణాల్లో మెకానిక్‌లు, మరికొంత మంది వృత్తిదారులతో సభ్యత్వం చేయిస్తున్నారు. సార్వత్రి ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పగా, సంక్షేమ బోర్డుకు రూ.100 కోట్లు నిధుల కేటాయించడం జరుగుతుందని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. వారు హామీలు గుప్పించి ఏడాది దాటినా నేటికీ కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు.

అనకాపల్లిలో ...

అనకాపల్లి, కశింకోట, మునగపాక, అచ్యుతాపురం, చోడవరం, మాడుగుల, రావికమతం, బుచ్చియ్యపేట యలమంచిలి మండలాల నుంచి అనకాపల్లి పట్టణంలో వేల్పులవీధి సర్వకాంబదాంబ పార్కు, గవరపాలెం పార్కు సెంటర్లకు నిత్యం వేలాదిమంది భవన నిర్మాణ కార్మికులు ఉదయం 8 గంటలకు నుంచి చేరుకుంటారు. అక్కడ నుంచి పనులు నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళతారు. భవనాలు నిర్మించుకునే యజమానులు ఈ రెండు ప్రాంతాలకు వచ్చి కార్మికులను తీసుకుని వెళతారు. భవన నిర్మాణ కాంట్రాక్టరు కూడా ఈరెండు ప్రాంతాల నుంచి లేబర్ని తీసుకుని వెళ్లి పనులు రోజువారీ కూలీలుగా పనులు చేయించుకుంటారు. వీరు ప్రమాదాలకు గురైనప్పుడుగాని, ఇతర సందర్భాల్లో ప్రభుత్వ పరంగా ఎటువంటి సాయం అందడం లేదు.

కార్మిక సంక్షేమ బోర్డులో నమోదుతో ప్రయోజనాలు

ఈ బోర్డులో నమోదు చేసుకుని, లేబర్ కార్డు పొందిన కార్మికుడు పనిచేసే ప్రదేశంలో ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా ప్రభుత్వం రూ.2లక్షలు ఆర్థిక సాయం అందజేస్తుంది. 50శాతం అంగ వైకల్యం చెందిన వారికి రూ. లక్ష, సాధారణ మరణం చెందిన కార్మికుడికి రూ.30వేలు అందజేస్తారు. వివాహం తర్వాత కార్మికునికి ఒక్కో కుమార్తెకు డెలివరీ సమయంలో రూ.25వేల చొప్పున రెండు కాన్పులకు ఆర్థిక సాయం అందజేస్తారు. స్వల్ప మొత్తం చెల్లించి సభ్యత్వం పొందడం ద్వారా 5 ఏళ్ల పాటు కార్మికుడికి,కార్మికుడి కుటుంబానికి లేబరు కార్డు రక్షణగా పనిచేస్తుంది. వీటిని పునరుద్ధరించాలని కార్మికులు కోరుతున్నారు.

పథకాలు అమలు చేయాలి



జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి అనకాపల్లి పట్టణానికి భవన నిర్మాణ కార్మికులు వస్తారు. ఎండ, వాన లెక్కచేయకుండా పనులు నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. భవన నిర్మాణ కార్మికులకు పనిచేసే ప్రాంతాల్లో ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతాయి. కార్మికులకు పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది మృత్యువాత పడగా, మరి కొంతమంది క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పథకాలు అమలు చేయడంతో పాటు ప్రభుత్వమే కొంత నిధిని ఇవ్వాలి.

– డి.నాయుడు, బుచ్చెయ్యపేట గ్రామం, బుచ్చెయ్యపేట మండలం.

నష్టపరిహారం ఇవ్వడం లేదు



సంక్షేమ బోర్డులో పేరు నమోదు చేయించుకున్న ప్రతి వ్యక్తికి ప్రభుత్వం నుంచి సహాయం అందజేయాలి. లేబరు కార్డు తీసుకునే సమయంలో ప్రభుత్వం రూ.120లు కట్టించుకుని రసీదు ఇస్తుంది. ప్రమాదాలు జరిగినప్పుడు పట్టించుకోవడం లేదు. భవన నిర్మాణ కార్మిక రంగంలో ఎక్కువగా మహిళలే పనులు చేస్తారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా మహిళలు భవన నిర్మాణ రంగంపై ఎక్కువగా ఆధారపడతారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి.

కె.సత్తిబాబు, జమ్మాదులపాలెం, కశింకోట మండలం.

9,038 మంది కార్మికులకు గుర్తింపు కార్డులు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల్లో 9,038 మంది కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చాం. లేబర్ కార్డులు పంపిణీ చేయడం నిత్య ప్రక్రియ, నెలకు రూ.20 వేలు కంటే తక్కువ ఆదాయం ఉండి, ఈఎస్ఐ, పీఎఫ్‌లేని కార్మికులందరికీ లేబరు గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుంది. ప్రభుత్వ అందజేస్తున్న వెల్ఫేర్ స్కీమ్స్ అన్ని కార్మికులకు వర్తిస్తాయి.

– బాలకృష్ణ, అనకాపల్లి కార్మికశాఖ అధికారి,

రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమలు నిలిపివేయాలి



రైతు బజార్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనకాపల్లి: రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమలును కూటమి ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని, లేని పక్షంలో ఈనెల 9న పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు అన్నారు. స్థానిక గవరపాలెం రైతు బజార్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కేంద్ర ప్రభుత్వం మార్పుచేయడం వల్ల కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. మన రాష్ట్రంలో కార్మిక చట్టాల్లో మార్పులు చేస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. వీటి అమలుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రతిఘటన తప్పదన్నారు. మోడీ ప్రభుత్వ అడుగుజాడల్లో చంద్రబాబు కూటమి ప్రభుత్వం నడుస్తోందని ఆయన మండిపడ్డారు. మహిళా సాధికారతపై ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే వివిధ ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న మహిళలందరికీ కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నూకరాజు, సంతోష్ ,శ్రీను, పోలారావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు..



టెన్త్‌లో అధిక మార్కులు సాధించిన రేష్మిని సత్కరిస్తున్న సంఘం సభ్యులు

అనకాపల్లి: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని భాగవతుల చారిటీ, శ్రీవైష్ణవ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎం.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను స్థానిక లక్ష్మీదేవిపేటలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం సత్కరించి, నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పదవతరగతిలో 452 మార్కులు సాధించిన లక్ష్మీదేవి పేటకు చెందిన పువ్వుల రేష్మి , ఇంటర్‌లో 709 మార్కులు సాధించిన అచ్యుతాపురం మండలం ఎం.జగన్నాథపురం గ్రామానికి చెందిన కాండ్రకోట హర్ష సాయిలను దుశ్శాలువాతో సన్మానించారు.

ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడారు. ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు నాగమణి, తిరునఘరి వెంకట రాధాకృష్ణ, తిరునఘరి వెంకట రమణారావు, సన్నిధి ఈశ్వర రావు, తిరుపతి శేఖర్, నీలాచలం వెంకట రమణ మూర్తి, చంటి, ముండూరు ఉదయ కుమార్ తదితరలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

మునగపాక:మండలంలోని తోటాడ,గవర్ల అనకాపల్లి గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం మరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణానికి శుక్రవారం గ్రామ పెద్దలు భూమిపూజ చేశారు. ఎంతో చరిత్ర కలిగిన మరిడిమాంబ ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో ఇరు గ్రామాల పెద్దలు నూతన ఆలయం నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. వచ్చే ఏడాదికి పండగను ఘనంగా నిర్వహించేలా నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు,ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి,పెద్దలు కాండ్రేగుల శివ,పాలమరశెట్టి నాగేశ్వరరావు,దొడ్డి రమేష్,పాలమరశెట్టి మురళి,బుద్ద రమేష్,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఆత్మ పీడీ ఆశాదేవి

మునగపాక:పచ్చిరొట్ట ఎరువుల వినియోగం ద్వారా ఆశించిన దిగుబడులు సాధించవచ్చని ఆత్మ పీడీ ఆశాదేవి తెలిపారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చూచుకొండ,గణపర్తి గ్రామాల్లో రైతులకు పంటల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగు చేయడం మంచిదన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీహరిరావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. పశుగ్రాస సాగులో యూరియా వాడకాన్ని తగ్గించడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మి,డీఆర్సీ ఏఈవో సాయి వాణి,సర్పంచ్‌లు దొడ్డి సూరప్పారావు, చదరం నాయుడు,ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్,రైతులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మునగపాక:మలేరియా నిర్మూలనకు అందరూ కృషి చేయాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని తోటాడ పంచాయతీలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు

కశింకోట: బక్రీద్ సందర్భంగా జామియా, నూరి మసీదులు, నరసింగబిల్లిలోని మసీదుల్లో శనివారం ఉదయం 7.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం బక్రీద్ పండగను సంప్రదాయంగా జరుపుకొంటామని మస్లిం ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వర స్వామి వార్షిక కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధిలో గల అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వార్షిక కల్యాణం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు బాబు ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలోభక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన



కశింకోట గ్రంథాలయంలో బహుమతులు పొందిన విద్యార్థులు



తాళ్లపాలెంలో వివిధ పోటీల విజేతలకు బహుమతుల అందజేస్తున్న అతిథులు

కశింకోట: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంచుతాయని, సద్వినియోగం చేసుకోవడం తద్వారా పిల్లలు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని రిటైర్డ్ ఎంఈవో నంబా రమణ తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం,కశింకోట శాఖ గ్రంథాలయాల్లో నెల రోజులకు పైగా నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా శిబిరంలో వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కశింకోట గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో రమణ మాట్లాడుతూ ఈ తరగతులు విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందించాయని చెప్పారు. గ్రంథాలయ అధికారి కె. వరలక్ష్మి, ఉపాధ్యాయుడు మళ్ల కోటేశ్వరరావు, రిటైర్డు టీచర్ వై. రామచంద్రరావు, వీహెచ్‌పీ ప్రతినిధి శిష్టి అప్పారావు, విశ్రాంత ఉద్యోగులు ప్రగడ నూకరాజు, అవసరాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తాళ్లపాలెం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నరసింహమూర్తి మాట్లాడుతూ గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదవడం వల్ల కొత్త విషయాలు తెలుసుకోవచ్చునన్నారు. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు హరనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలన్నారు. ఈ సందర్భంగా వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మరో ఉపాధ్యాయుడు రమేష్, గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం పాల్గొన్నారు.

ముంచెత్తిన వర్షం



చింతావారి వీధిలో కరెంట్ వైర్లపై పడిన చెట్టు



గవరపాలెం మందుగుండు సీతారామయ్య వీధిలో నిలిచిన నీరు

అనకాపల్లి టౌన్: పట్టణంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. గత నాలుగైదు రోజుల నుంచి తీవ్ర ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కురిసిన వర్షంతో సేదతీరారు. సుమారు గంటసేపు వర్షం పడింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి చింతావారి వీధిలో ఓ చెట్టు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడింది. ఆ సమయంలో సమీపంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆ పరిసర ప్రాంతాల్లో సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గవరపాలెం పార్కు సెంటర్, రైల్వే అండర్ బ్రిడ్జి, రాణిగారి పూలతోట రోడ్డు, మందుగుండు సీతారామయ్య షాపు రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహించింది. పాదచారులు, ద్విచక్రవాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

కశింకోట: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసి, వాతావరణం చల్లబడింది. రెండు రోజులుగా వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. రోడ్లు బురదమయంగా మారాయి.



రాణిగారి తోటలో రోడ్డుపై నిలిపోయిన నీరు

రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న అధికారులు

మునగపాక:రాయితీపై అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని వీఏఏ తులసి తెలిపారు. మండలంలోని వాడ్రాపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు రాయితీపై విత్తనాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు,ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, నూకప్పారావు,శేషు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న శీరం నర్సింహమూర్తి తదితరులు

నక్కపల్లి: మండలంలో ఉపమాక శివారు సారిపల్లిపాలెంలో శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శీరం నర్సింహ మూర్తి ఆధ్వర్యంలో గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఆలయ నిర్మాణ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.20 లక్షలు విరాళంగా సేకరించి ఆలయం నిర్మించడానికి సంకల్పించినట్టు శీరం నర్సింహమూర్తి తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సాగునీటి కాలువల అభివృద్ధికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఏషియన్ పెయింట్స్ జీఎం చటర్జీ

మునగపాక:సాగునీటి కాలువల అభివృద్ధికి అవసరమయ్యే సహకారం అందిస్తామని ఏషియన్ పెయింట్స్ జీఎం మౌనిక్ చటర్జీ తెలిపారు. మండలంలోని పాటిపల్లి పంచాయతీ మంగళవరప్పేట, మునగపాకలో పలు చోట్ల కాలువలపై గేట్లు ఏర్పాటు చేసేందుకు శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏషియన్ పెయింట్స్ సహకారంతో సాగునీటి కాలువలపై గేట్లు,తలుపులు ఏర్పాటు చేస్తామన్నారు. నీటి వనరుల పునరుద్ధరణ పథకంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏషియన్ పెయింట్స్ ప్రతినిధులు శ్రీజిత్ టినీ,మహేంద్ర వాడ్వాని, కె.అనిల్ కుమార్,ఉదయభాస్కర్,సర్పంచ్ ఆడారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.